# కామ్రేడ్ తరిమెలనాగిరెడ్డి చూపిన విప్లవ బాటలో ముందుకు సాగుదాం!



**జులై 28, 2016 నాటికి కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అమరులై 40 సంవత్సరాలు నిండుతాయి. ఈ సందర్భంగా ఆ ప్రియతమ విప్లవ కమ్యూనిస్టు నాయకుని స్మరించుకొని, ఆయన ఏ మహత్తర ఆశయం కోసం తన జీవితాంతం పోరాడి, అమరులయ్యారో ఆ విషయాలను జ్ఞప్తికి తెచ్చుకొని, ఆయన యొక్క బోధనలకు అణుగుణంగా విప్లవకర్తవ్య నిర్వహణకు పునరంకితం కావటం ద్వారా ఆ మహనీయునికి మనం నివాళి అర్పిద్దాం.**

కామ్రేడ్ తరిమెలనాగిరెడ్డి మహోన్నతమైన విప్లవ కమ్యూనిస్టు నాయకులు. విశిష్టులైన మార్క్సిస్టు – లెనినిస్టు మేధావి. భారతదేశంలో విప్లవాన్ని సాధించి, భారతదేశ సముజ్వల కీర్తిని పునఃప్రతిష్టింపచేయటమన్నది ఆయన లక్ష్యం. ఆ రకంగా ఆయన అత్యుత్తమమైన దేశభక్తులు. భారత విప్లవకర రాజకీయరంగంలో ఆయన వీరుడై వెలిగారు. భారత విప్లవం కోసం ఆయన తన సర్వస్వాన్నీ త్యాగం చేసిన మహనీయుడు. విప్లవవాద కమ్యూనిస్టు సిద్ధాంత సూత్రధారులలో ఆయన ప్రముఖుడు.

భారతదేశంలో నాటికి అధికారమార్పిడి జరిగిన 25 సంవత్సరాల తర్వాత కూడా దేశంలో అలుముకొన్న నికృష్ట, దయనీయ పరిస్థితులకు గల కారణాలను విశేషంగా అధ్యయనం చేసిన కామ్రేడ్ టి.ఎన్. వాటిని మార్క్సిస్టు – లెనినిస్టు దృక్పధంతో విశ్లేషించారు. ప్రత్యేకించి భారతదేశంలో విదేశీ పెట్టుబడి యొక్క పాత్రపై తన దృష్టిని కేంద్రీకరించారు. దేశ ఆర్థికాభివృద్ధి కోసం విదేశీ పెట్టుబడిని ఆశ్రయించటమంటే, సామ్రాజ్యవాద దోపిడీని ఆహ్వానించడం, దానికి దాసోహమవటం తప్ప మరొకటి కాదని ఆయన తన పరిశీలనలో నిర్ద్వందంగా తేల్చి చెప్పారు. 1947లో జరిగినది కేవలం దోపిడీ పాలకవర్గాల మధ్య జరిగిన అధికార మార్పిడి తప్ప నిజమైన స్వాతంత్ర్యం కాదని, సకారణంగా ఆయన నిరూపించారు. దేశంలోకి ప్రవహించిన విదేశీ పెట్టుబడి వలన, విదేశీ పెట్టుబడిపై ఆధారపడటం వలన దేశ ఆర్థిక స్వాతంత్రం ఒక ఎండమావేనని ఆయన హెచ్చరించారు. భారతదేశం అర్ధవలస – అర్ధఫ్యూడల్ దేశమేనని ఆయన నిర్ధారించారు. అందువలన పూర్తికాబడని జాతీయ విమోచనోద్యమాన్ని, పోరాటాన్ని మరింత ధృడనిశ్చయంతో, మరింత శక్తితో కొనసాగించటం భారత ప్రజల కర్తవ్యమని ఆయన వివరించారు.

గతకాలపు క్రమశిక్షణతో, నిస్వార్ధ త్యాగబుద్ధితో, గతకాలంలో మాదిరి కష్టపడి పనిచేయటం ద్వారా, విప్లవకారులు విప్లవ కమ్యూనిస్టు పార్టీని పునర్నిర్మించాలనీ, బలమైన పునాదులపై విప్లవ నిర్మాణాన్ని పునర్నిర్మించాలనీ, సక్రమమైన సైద్ధాంతిక, పంధా పునాదులపై బలమైన నిర్మాణం ద్వారా గట్టి విప్లవోద్యమాన్ని నిర్మించాలనీ భోదిస్తూ – ఆయన తన జీవితకాలమంతా – విప్లవోద్యమ నిర్మాణం కోసం ఒక ఆదర్శప్రాయమైన కృషిని మొక్కవోని దీక్షతో సాగించారు. తాకట్టులో భారతదేశం అనే తన కోర్టు స్టేట్‌మెంటు ద్వారా భారత వ్యవస్థ యొక్క దోపిడీవర్గ స్వభావాన్ని సమగ్రంగా విశ్లేషించి, ఒక నూతన ప్రజాతంత్ర విప్లవం జరగాల్సిన ఆవశ్యకతనూ, అనివార్యతనూ తిరుగులేని విధంగా నిరూపించారు.

కామ్రేడ్ తరిమెలనాగిరెడ్డి నాడు పేర్కొన్న వాస్తవాలూ, చేసిన నిర్ధారణలూ, నిర్ణయాలూ, నాటికంటే కూడా నేడు భారతదేశ పరిస్థితులకు మరింతగా ప్రాసంగికతను కలిగివున్నాయి; ఉపయోగకరంగా వున్నాయి.

విదేశీ పెట్టుబడుల వలన దేశం నుండి సంపద విదేశాలకు అనేక రూపాల్లో తరలింపబడుతుందనీ, దేశం ఆర్థికంగా అభివృద్ధి కాకపోగా దేశంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత, దారిద్ర్యం అనూహ్యంగా పెరిగిపోతుందని ఆయన హెచ్చరించారు. దేశం పరాధీన స్థితిలోకి నెట్టబడుతుందని హెచ్చరించారు. అందుకే అప్పటికే (1972 నాటికే) భారతదేశంలోకి ప్రవహించిన విదేశీ పెట్టుబడి, దేశ సంపదను దోచుకుపోతున్న వైనాలపై ఆధారపడి, భారతదేశం విదేశీ పెట్టుబడికి తాకట్టు పెట్టబడిందని సక్రమంగానే నిర్ధారించారు.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అమరులైన తర్వాత యీ నలభై సంవత్సరాల కాలంలోనూ భారతదేశంలోకి విదేశీ పెట్టుబడి ప్రవాహం సులభతరమయ్యేందుకు గేట్లు బార్లా తెరవబడ్డాయి. విదేశీ పెట్టుబడి తన దోపిడీని యధేచ్ఛగా సాగించుకోవటానికి మెండైన అవకాశాలు, రక్షణలు, రాయితీలు కల్పించబడ్డాయి. ఇందుకోసం దేశంలోని ప్రజల ప్రధాన జీవనాధారమైన వ్యవసాయరంగం పూర్తి నిర్లక్ష్యం చేయబడి, తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టబడింది. రైతాంగపు జీవనాధారమైన భూమిని ప్రభుత్వం బలవంతంగా గుంజుకోని, బడా పెట్టుబడిదారీ అంతర్జాతీయ కార్పొరేషన్లకు చట్టబద్ధంగా ధారాదత్తం చేస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రక్షణ కోసం దేశ ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కులు రద్దుచేయబడుతున్నాయి; హరించివేయబడుతున్నాయి.

ఒక క్రమపద్ధతిలో పలు కీలకరంగాలలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి 100% ప్రవేశించటానికి అనుమతులు యివ్వబడ్డాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి కార్యకలాపాలపై వున్న చట్టబద్ధ నియంత్రణలు పూర్తిగా ఎత్తివేయబడ్డాయి. రక్షణ రంగం, ఔషధాల తయారీ రంగం, పౌర విమానయాన రంగం, సింగిల్ బ్రాండ్ రిటైల్‌రంగం, ఆహార ఉత్పత్తుల ఇ-కామర్స్ రంగాలలోకి 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రవేశానికి అనుమతి యివ్వబడింది.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆహ్వానించటం, రక్షించటం, సంతోషపెట్టడమన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏకైక ధ్యేయం, విధి అన్నట్టుగా పరిస్థితి మార్చబడింది. గతంలో కేవలం కేంద్ర ప్రభుత్వమే విదేశీ పెట్టుబడులను అనుమతించటం, ఆహ్వానించటం, రంగాలను నిర్ణయించటం అన్న విధానం అమలుజరపబడేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వమేకాక, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వయంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని తమ తమ రాష్ట్రాలలోకి అనుమతించటం, అందు కోసం దేశ దేశాలూ రాష్ట్ర పాలకులే పర్యటించి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని తమ తమ రాష్ట్రాల్లో పెట్టమని 'బిచ్చమెత్తుకోవటం' జరుగుతోంది. ఇదంతా దేశపు ఫెడరలిజం పేరిటా, భారతదేశం యొక్క అంతర్గత పెట్టుబడికి విదేశీ పెట్టుబడి మద్దతును సంపాదించే పేరిట, సాంకేతిక నైపుణ్యాలను విదేశాల నుండి ఆ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ద్వారా పొంది, దేశపు ఆర్థికాభి వృద్ధిని వేగవంతం చేయటం పేరిట జరిగిపోతోంది.

అయితే యిందువల్ల వాస్తవంగా దేశంలో ఆర్థికాభివృద్ధి జరుగుతోందా అంటే అది అబద్ధమని ఆచరణలో రుజువవుతోంది.

మనదేశపు అనుభవంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి, మన ఆర్థిక వ్యవస్థను తన అదుపులో పెట్టుకొం టోందనీ, దేశంలోకి ప్రవహించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి వలన మనకు విదేశీ సాంకేతికత అందుబాటులోకి రావటంలేదని నిరూపితమవుతోంది.

విదేశీ పెట్టుబడులు దేశంలోకి ప్రవహించటం వలన, దేశం యొక్క విదేశీ ద్రవ్య చెల్లింపుల భారం తగ్గటానికి బదులు, విదేశీమారక చెల్లింపుల సమస్య తీవ్రమయిందనీ, గల్ఫ్ దేశాల నుండి అనేక కష్టనష్టాల కోర్చి – కడుపు కట్టుకొని దేశానికి కార్మికులు పంపుతున్న చెల్లింపులే కనుక లేకపోతే, ఎప్పుడో యీ విదేశీమారక చెల్లింపుల సమస్య దేశాన్ని తలెత్తలేనంతగా ముంచివేసేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

దేశం చేసిన విదేశీ అప్పుకన్నా గణనీయమైన ఎక్కువ మొత్తాలు రాయల్టీలు, లాభాలు, సాంకేతికతకు అందించిన ఫీజులు తదితర రూపాల్లో విదేశీ పెట్టుబడి తరలించుకుపోతున్నదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రిజర్వుబ్యాంకు లెక్కల ప్రకారం 2009–10 నుండి 2014–15 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో విదేశీ కంపెనీలు తమ మాతృదేశాలకి పంపే మొత్తాలు (రిపాట్రియేషన్లు), డివిడెండ్లు, సాంకేతికత యిచ్చినందుకు చెల్లింపుల పేరిట, ఈ దేశంలోకి ప్రవహించిన ఈక్విటీల మొత్తంలోని సగం మొత్తం, పెట్టుబడి పెట్టిన విదేశాలకు తరలించబడిందట!

రిజర్వు బ్యాంకు ప్రకారం యిదే కాలంలో, మనదేశంలో వున్న విదేశీ కంపెనీల అనుబంధ కంపెనీలన్నీ ఉత్పత్తి (తయారీ) రంగాల్లోనూ, రుణాత్మక వ్యాపారం నిర్వహించినట్లు తమ పద్దుల్లో చూపించాయట! స్వదేశాలకు చెల్లింపులు తదితర రూపాలలో యీ విదేశీ అనుబంధ కంపెనీలన్నీ ఒక క్రమపద్ధతిలో తమకు గల అదనపు పెట్టుబడిని తమ స్వదేశాలకు తరలించాయి. ఈ మొత్తాలు మనదేశంలో పెట్టిన పెట్టుబడికన్నా చాలా ఎక్కువ మోతాదులో వున్నాయి.

ఇవిగాక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పెట్టే కంపెనీలు ప్రత్యక్షపు ఖర్చుల రూపంలోనేకాక, అనేక పరోక్ష రూపాల్లో – ద్వైపాక్షిక పెట్టుబడి ప్రోత్సాహక ఒప్పందాలలోని నిబంధనలను ఉపయోగించుకొని మరిన్ని లాభాలను మన ప్రభుత్వం నుండి పిండుకొంటున్నాయి.

ఐక్యరాజ్యసమితి యొక్క వాణిజ్య అభివృద్ధి (అంక్టాడ్) సమావేశంలో యివ్వబడిన సమాచారం ప్రకారం, విదేశాలకు తరలించబడిన (విదేశీ పెట్టుబడిదారులు తమ స్వదేశాలకు తరలించిన) పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని మాత్రమే వారు, తిరిగి ఆయాదేశాల్లో (రుణగ్రహీత) పెట్టుబడిగా పెట్టబడుతున్నారట!

ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిదారులు, తాము మన దేశంతో చేసుకొన్న ఒప్పందాలలోని షరతులను ఆధారంగా చేసుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల భారాన్ని చెల్లించకుండా సవాలు చేస్తున్నారు. ఉదాహరణకు : ఎడింబరోకు చెందిన కైర్న్ ఎనర్జీని, భారత ప్రభుత్వ ఆదాయ పన్నుల శాఖ 2007వ సంవత్సరం పన్ను మదింపు ప్రకారం 1.6 బిలియన్ల డాలర్ల పన్నునూ, దానిపై వడ్డీని, పెనాల్టీని చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తూ ఆ కంపెనీకి నోటీసు యిచ్చింది. అయితే ఆ కంపెనీ తాను ఆ పన్నునూ, దానిపై వడ్డీని, పెనాల్టీలనూ చెల్లించను అంటూ, భారత – బ్రిటన్ వాణిజ్య ఒప్పంద షరతు క్రింద వివాదం లేవనెత్తటమే కాకుండా, యిప్పుడు అంతర్జాతీయ మధ్యవర్తిత్వ నిబంధన క్రింద, ఎదురు తిరిగి భారతదేశం తమకు నష్టపరిహారం యివ్వాలంటూ దావాను ఫైలుచేసింది. తనను పన్ను డిమాండు చేసినందువల్ల జరిగిన నష్టానికి ఒక బిలియను డాలర్లు, తనను వడ్డీతో పెనాల్టీలు చెల్లించ మన్నందుకుగాను 4.6 బిలియన్ల డాలర్లూ కలిపి మొత్తం 5.6 బిలియన్ల నష్టపరిహారం యిప్పించాలని అంతర్జాతీయ మధ్యవర్తిత్వ ప్యానల్ ముందు దావా వేసింది. ఇదేవిధంగా 11 బిలియన్ల డాలర్ల విలువ గల హచిసన్స్ ఇండియా ఆస్తుల కొనుగోలు చేసినందుకు పన్ను చెల్లించాల్సిందిగా 2007లో ఆదాయపు పన్నులశాఖ ఒడాఫోన్‌కు నోటీసు యిచ్చింది. ఈ టాక్సు డిమాండును సమర్థించిన వోడాఫోన్ కూడా, పన్ను చెల్లించ నిరాకరిస్తూ కెయిర్న్ త్రోవలోనే నడవటానికి సిద్ధమవుతోంది.

ఇటీవలనే సి.ఎ.జి (కం[ప్టోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఆరు విదేశీ టెల్కో కంపెనీలైన వొడాఫోన్, ఆర్‌కాం, ఎయిర్‌టెల్ తదితరములు తమ వ్యాపార లావాదేవీలలో వచ్చిన ఆదాయాన్ని తక్కువగా చూపించి రూ. 12,500 కోట్ల పన్ను ఎగగొట్టినట్టు వెల్లడించింది. ఇదే సి.ఎ.జి కేవలం 30 కార్పొరేటు సంస్థలు 48 లక్షల ఏభై వేల కోట్ల రూపాయల మేరకు దేశంలోని బ్యాంకుల వద్ద తీసుకొన్ని అప్పులను ఉద్దేశ్య పూర్వకంగా చెల్లించకుండానే ఎగకొట్టి మోసానికి పాల్పడ్డాయనీ, యీ మొత్తంలోని ఎక్కువభాగం విదేశాలకు తరలించబడి వుంటుందనీ, దాన్ని తిరిగి రాబట్టడం అసాధ్యమనీ వెల్లడించింది. కేవలం 2016 జనవరి నుండి మార్చి వరకూ గల 3 నెలల కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు యిందువలన 15,000 కోట్ల రూపాయలు (2 బిలియన్ల డాలర్లు) నష్ట పోయాయని వెల్లడించింది.

ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ ఋణభారం, దేశంలో పెరిగింది అని చెప్పబడుతున్న జి.డి.పి. మొత్తంలో సగం వుంటుందట! ఇదీ ప్రజలు ఆదా చేసుకొన్న మొత్తాలను బ్యాంకుల నుండి కార్పొరేట్లు దోచుకొంటున్న వైనం!

ఈ రకంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అన్నది ఆచరణలో దేశ సంపదను తరలించుకుపోవటమే కాకుండా, దేశాన్ని పూర్తిగా పరాధీనం గావిస్తోంది. ఇందుకు బాధ్యులు దేశంలోని పాలకులు, పాలక వర్గాలూ ప్రత్యేకించి దళారీవర్గంగా పరిణామం చెందిన భారత బూర్జువాలలోని ప్రధాన భాగం. ఇక యిప్పుడు ఆనాడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి అన్న 'తాకట్టులో భారతదేశాన్ని' అదే ఆలోచనల వెలుగులో 'పూర్తి పరాధీన భారతదేశం' అనటం ఎంతమాత్రం అతిశయోక్తి కాబోదు.

ఒకవైపు దేశం నుండి అపారమైన సంపద నిరంతర తరలింపు, మరోవైపు దేశంలో అనూహ్య పరిమాణంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, అసమానత, పేదరికం, అనారోగ్యాలూ – యిదీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిలో ముంచెత్తబడ్డ భారతదేశ దయనీయ స్వరూపం.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి నొక్కి వక్కాణించినట్లు మన దేశ సర్వస్వాన్నీ విదేశీ దోపిడీ పెట్టుబడులకు అమ్మివేసిన ఈ సిగ్గుచేటైన పరిస్థితులను వ్యతిరేకిస్తూ, మార్చటానికి అణుమాత్రపు దేశభక్తి గల పౌరుడు కూడా తిరుగుబాటు చేయకుండా వుండగలుగుతాడా? పోరాట పథాన్ని ఎంచుకోకుండా వుండగలడా?

అందుకే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చూపిన మార్గంలో ప్రజలను చైతన్యవంతం గావించేందుకు ప్రజలను భ్రమలపాలు చేసే, మోసగించే ఎత్తుగడలను బట్టబయలు చేస్తూ, విప్లవ విజయం కోసం స్వీయాత్మక పరిస్థితులను త్వరితపరుస్తూ, అన్ని విప్లవ పోరాట రూపాల్లోనూ ప్రావీణ్యత సంపాదిస్తూ, సామ్రాజ్యవాద ప్రతిరూపమైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి శక్తులనూ, వారి తొత్తులైన దేశీయ దళారీ బూర్జువా వర్గాన్నీ, ఫ్యూడల్ వర్గాలనూ ఓడించటానికి పునరంకితమవుదాం!

**అదే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డికి విప్లవకారులు సమర్పించాల్సిన నిజమైన నివాళి!**
**విప్లవ విజయాన్ని నిజం చేద్దాం!!**

**oooooo**